ANN తెలుగు

Follow: @ANNTELUGU

02-08-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 210 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## ఉత్తరాంధ్రలో వైభోగ యుగానికి నాంది పడిందా?

సముద్రపు కెరటాల హోరులో.. భోగాపురం గాల్లో తేలుతున్న కీర్తి పతాక. ఉత్తరాంధ్ర నలుదిశలా విశ్వాసపు వెలుగులు.. వైజాగ్ గూగుల్ డిజిటల్ స్పర్శతో తలపుల సరిహద్దులు దాటుతున్న అభివృద్ధి ప్రయాణం. అమరావతి రాజధాని శిఖరాన.. రాయలసీమ పరిశ్రమల హొయల్లో.. నేడు ఉత్తరాంధ్ర వైభోగం వినువీధుల్లో విహరిస్తోంది. కేంద్రరాష్ట్ర సమన్వయపు అపురూప వ్యూహంతో, ఢిల్లీ పెద్దల అండతో ఏపీ రథసారథి చంద్రబాబు రచిస్తున్న ప్రగతి మహాకావ్యమిది. భోగాపురం... అభివృద్ధి ద్వారమా? చంద్రబాబు వ్యూహం... కేంద్ర సహకారానికి కొత్త మంత్రామా? మోదీనాయుడు సమన్వయం... ఏపీకి వరాల వర్షం కురిపిస్తోందా? మూడు ప్రాంతాల సమాన అభివృద్ధి... కల సాకారమవుతోందా?

తెరవెనుక రాజకీయ రసవత్తర చిత్రాలు, యువత ఆలోచనల స్పందనలు, ఎన్డీయే పాలనా వైభవపు అంతరంగాలు... అక్షరాల సాక్షిగా ... ఏఎన్ఎన్ ఛానల్, మహా పత్రిక సీఈవో



04


కంది రామచంద్రారెడ్డి

*వీకెండ్ అనాలసిస్*

టాప్ న్యూస్

### ఇదీ ఉత్తరాంధ్ర దెబ్బ

అర్థమైందా రాజా లోకేశ్ కౌంటర్



02

### బీజేపీ పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది

- ప్రశ్నిస్తే దేశద్రోహం ముద్ర వేస్తున్నారని విమర్శ
- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్



02

### డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవాలి

- మద్దతు ఇస్తే ద్రోహమే
- రాహుల్ గాంధీ



02



# చంద్రబాబు విజన్‌కు భోగాపురం సాక్ష్యం

రూ.18వేల కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

- చంద్రబాబు..పవన్.. ఏపీలో డబుల్ అభివృద్ధి
- ఆసియాలోనే గొప్ప పారిశ్రామిక కేంద్రంగా విశాఖ ఎకనమిక్ రీజియన్
- ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు నాంది పలికింది: సీఎం చంద్రబాబు

## ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవంలో ప్రధాన మంత్రి మోదీ

**విజయనగరం, మహా :** చంద్రబాబు విజన్‌కు భోగాపురం సాక్ష్యమని, స్వర్ణాంధ్ర విజన్2047 సాకారానికి ఇది కీలకమైన రోజు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. రూ.18 వేల కోట్లతో శనివారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయని ఆయన చెప్పుకొచ్చారు. 'సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మ వారికి ప్రణామాలు. 13,500 మంది గిరిజన మహిళల నృత్యం అద్భుతంగా ఉంది. అభివృద్ధితోపాటు థింసా నృత్యంలోనూ నేడు సరికొత్త చరిత్ర సృష్టించారు. ఇది చంద్రబాబు విజన్‌కు మరో సాక్ష్యం. ఈరోజు రూ.18 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. ఈ ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయి. కొత్త ప్రాజెక్టులు ఎయిర్, రోడ్ కనెక్టివిటీని పెంపొందిస్తాయి. చంద్రబాబు, పవన్ నేతృత్వంలో ఏపీలో డబుల్ అభివృద్ధి జరుగుతోంది. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీ అభివృద్ధి వేగంగా కొనసాగుతోంది. దేశంలో 2014 కంటే ముందు మిగతా 2వ పేజీలో



తలసరి ఆదాయంలో

# తెలంగాణ దూకుడు



తెలంగాణ బలమైన ఆర్థికప్రగతికి నిదర్శనం

- రూ.4.18 లక్షలకు చేరిన తలసరి ఆదాయం
- గత ఏడాది కంటే రూ.38,900 పెరుగుదల
- సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ఆర్థికాభివృద్ధి దేశంలోనే కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.38,900 పెరుగుదల నమోదైందని వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు కావడం తెలంగాణ బలమైన ఆర్థిక ప్రగతికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తలసరి ఆదాయంపై ప్రచురితమైన వార్తా కథనానికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పంచుకున్న ముఖ్యమంత్రి, దేశంలో అత్యుత్తమ ఆర్థిక పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ మిగతా 2వ పేజీలో

### వాట్సాప్ అంకుల్స్‌పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు

02



- వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్ జీ ఓటర్లు
- సోషల్ మీడియా వల్లే జవాబుదారీతనం పెరిగింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## ఇందిరమ్మ టవర్స్‌కు ఫుల్ రెస్పాన్స్

- 10 రోజుల్లో 20 వేల దరఖాస్తులు.
- రూ.660 కోట్లతో 16 టవర్ల నిర్మాణానికి టెండర్లు.
- ఈ నెలాఖరులో పనుల ప్రారంభానికి సన్నాహాలు

02





కేటీఆర్ మళ్లీ అమెరికా వెళ్లాల్సిన

## టైమ్ వచ్చేసింది

### మంత్రి ఉత్తమ్ ఫైర్

**కరీంనగర్, మహా :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ఉద్యోగం చేసుకునేందుకు అమెరికా వెళ్లాలని తెలంగాణ మంత్రులు సూచించారు. నీళ్ల గురించి తెలియని కేటీఆర్‌కు అదే మంచిదని తెలంగాణ మంత్రులు వివేక్ వెంకటస్వామి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రాజెక్టులపై అవగాహన లేని కేటీఆర్, హరీశ్ రావులు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వర్షాలు రావొద్దని బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం కోరుకుంటోందని విమర్శించారు.

**శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిశీలించిన మంత్రులు**

నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కడెం ప్రాజెక్టులకు భారీ వరద పోటెత్తుతుండడంతో పరిశీలించేందుకు తెలంగాణ మంత్రులు నిర్మల్ జిల్లాకు వచ్చారు. మొదట నిర్మల్ సమీకృత కలెక్టర్ కార్యాలయ భవనానికి చేరుకున్న మిగతా 2వ పేజీలో



# తలసరి ఆదాయంలో తెలంగాణ దూకుడు



( మొదటి పేజీ తరువాయి )

ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక విస్తరణ, ఉపాధి అవకాశాల పెరుగుదల, సమర్థవంతమైన పాలన వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానపరమైన సంస్కరణలు, పారదర్శక పరిపాలన, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కారణంగా తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోందని సీఎం తెలిపారు. ప్రపంచ స్థాయి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం, కొత్త పరిశ్రమలు ఏర్పడటం, ఉపాధి అవకాశాలు విస్తరించడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేశాయని అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా మహిళలు, రైతులు, యువత జీవితాల్లోనూ ప్రతిఫలిస్తున్నాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

**నిరాశను తొలగించి..**

గత దశాబ్దంలో ఏర్పడిన నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపగలిగామని సీఎం అన్నారు. తెలంగాణను దేశంలోనే అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి సృష్టిలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తూ, పరిశ్రమల విస్తరణకు ఊతమిస్తూ, యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ కొనసాగిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దీంతో తెలంగాణ ఆర్థికాభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# చంద్రబాబు విజన్‌కు భోగాపురం సాక్ష్యం



( మొదటి పేజీ తరువాయి )

74 ఎయిర్‌పోర్ట్‌లు మాత్రమే ఉండేవి. ఆ తర్వాత ఎయిర్‌పోర్ట్‌ల సంఖ్య 166కి పెరిగింది. ఒకే కుటుంబానికి చెందిన పేర్లను విమానాశ్రయాలకు పెట్టలేదు. అయోధ్య ఎయిర్‌పోర్ట్‌కు వాల్మీకి పేరు పెట్టాం. భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి పేరు పెట్టాం. చిన్న పట్టణాల నుంచి నగరాల వరకు ఎయిర్ సేవలు అందిస్తున్నాం. ఉడాన్ పథకం వల్ల ఎయిర్‌పోర్ట్‌ల సంఖ్య పెరగడమే కాదు.. విమాన ప్రయాణికుల సంఖ్యా పెరిగింది. పేదల కలలు సాకారం చేసేలా అభివృద్ధి చేస్తున్నాం. విశాఖ నుంచి కృష్ణపట్నం వరకు పాత పోర్టుల అభివృద్ధి జరుగుతోంది. మూలపేట, రామాయపట్నంలో కొత్త పోర్టులను నిర్మిస్తున్నాం. ప్రధాన పారిశ్రామిక కారిడార్లనూ అనుసంధానం చేస్తున్నాం. పీఎం గతిశక్తితో రైల్, పోర్టు, ఎయిర్‌పోర్ట్‌ల అభివృద్ధి జరుగుతోంది అని చెప్పుకొచ్చారు.

**నాడు కొబ్బరికాయకొట్టాం.. ఇపుడు గుమ్మడికాయ కొట్టాం : సీఎం చంద్రబాబు**

భోగాపురం: అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు నాంది పలికిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టును ప్రధాని మోదీ జాతికి అంకితం చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ‘‘ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనం ఈ ఎయిర్‌పోర్టు. భూములిచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నా. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మారే ఈ ఎయిర్‌పోర్టు నిర్మించారు. తొలి అడుగు వేసిన అశోక్‌గజపతిరాజు, నిర్మాణం పూర్తిచేసే బాధ్యత తీసుకున్న రామ్మోహన్ ఇక్కడి వారే. భోగాపురం ఎయిర్‌పోర్టుకు నాడు కొబ్బరికాయ కొట్టింది మనమే.. నేడు గుమ్మడికాయ కొట్టింది మనమే. ఈ విమానాశ్రయంతో ఈ ప్రాంతం దశ, దిశ మారతాయి. ఉత్తరాంధ్రకు గూగుల్, స్టీల్ కంపెనీతో పాటు చాలా సంస్థలు వచ్చాయి. రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని చూశాం. కష్టాల్లో ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన వ్యక్తి మోదీ. పోలవరం, రైల్వే జోన్, విశాఖ ఉక్కును కాపాడిన వ్యక్తి మోదీ. ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు పెట్టుబడులు రాబోతున్నాయి. రూ.2,784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. రాజధాని అమరావతికి నిధులు ఇచ్చి అండగా నిలబడ్డారు. 2028 నాటికి అమరావతి మొదటి దశ పనులన్నీ పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తాం. ప్రధాని మోదీ .. 12 ఏళ్లుగా దేశాన్ని సమర్థంగా నడిపిస్తున్నారు. ఈ దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. పరిపాలనలో అవినీతి ఆరోపణలు లేకుండా ముందుకెళ్తున్నారు. రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలు నిర్మిస్తున్నారు. సౌరశక్తి, గ్రీన్ హైడ్రోజన్ ద్వారా కాలుష్యం తగ్గిస్తున్నారు. దేశంలో తీవ్రవాదం, నక్సలిజం లేకుండా అరికట్టారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సుభిక్షంగా ఉంటోంది. ఇలాంటి నేతలను నా రాజకీయ జీవితంలో చూడలేదు. ప్రతి విషయంలో నేషన్ ఫస్ట్ .. అనే ప్రధానిని తొలిసారి చూస్తున్నా. భారత్.. 2047లోగా ప్రపంచంలోనే నంబర్ వన్‌గా మారుతుంది’’ అని సీఎం అన్నారు. సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు ఏపీ మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవాలి

- మద్దతు ఇస్తే ద్రోహమే
- రాహుల్ గాంధీ

**ఢిల్లీ, మహా :** నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును కేంద్ర ప్రభుత్వం మరోసారి పార్లమెంటు ముందుకు తీసుకురావచ్చన్న రాజకీయ చర్చల నేపథ్యంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్ బిల్లు తమిళనాడు ప్రజాస్వామిక హక్కులను దూరం చేసే కుట్ర అని ఆరోపిస్తూ, ఈ బిల్లును అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, డీలిమిటేషన్ బిల్లు తమిళనాడును రాజకీయంగా బలహీనపరిచే విధంగా రూపొందించబడిందని విమర్శించారు. ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం అంటే తమిళనాడుకు ద్రోహం చేసినట్లేనని పేర్కొన్నారు. తమిళనాడుకు చెందిన ఏ రాజకీయ పార్టీ గానీ, ఏ ప్రజాప్రతినిధి గానీ ఈ బిల్లుకు మద్దతు ఇవ్వకూడదని, ప్రతి ఒక్కరూ దీనిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. జాతీయ పార్టీలతో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా ఈ బిల్లును పార్లమెంటులో వీగిపోయేలా కృషి చేయాలని రాహుల్ గాంధీ కోరారు. తమిళనాడు హక్కులను కాపాడేందుకు అన్ని రాజకీయ శక్తులు ఏకమవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇటీవల పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్లమెంటులో ఎన్డీయే బలం పెరిగిందన్న విశ్లేషణల మధ్య, మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లును కూడా కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకురావచ్చనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



# ఇందిరమ్మ టవర్స్ కు ఫుల్ రెస్పాన్స్

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన పది రోజుల్లోనే సుమారు 20 వేల దరఖాస్తులు అందాయి. ఇదే ఊపులో ఈ నెల 10 వరకు గడువు ఉండటంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7,680 ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు తెలంగాణ హౌసింగ్ బోర్డు కార్యాచరణ వేగవంతం చేసింది. ఇందుకోసం పది ప్యాకేజీల్లో రూ.660 కోట్ల అంచనా వ్యయంతో 16 టవర్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ప్రారంభించింది. ఈ నెలాఖరులోపు నిర్మాణ పనులు ప్రారంభించాలనే లక్ష్యంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జూలై 21 నుంచి రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం మీసేవ దరఖాస్తు విధానంలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. చిరునామా ధ్రువీకరణకు ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ వంటి పత్రాలను కూడా అనుమతించింది. దీంతో ఆధార్‌లో స్వస్థల చిరునామా ఉన్నా, హైదరాబాద్‌లోని ఇతర గుర్తింపు పత్రాలతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. అయితే ఒక కుటుంబం నుంచి ఒక్కరే దరఖాస్తు చేయాలని స్పష్టం చేసింది.

దరఖాస్తుతో పాటు రూ.10 వేల ఈఎండీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 19వ తేదీ వరకు కాంట్రాక్టర్ల నుంచి టెండర్ బిడ్లు స్వీకరించనున్నారు. హైదరాబాద్ జిల్లాలో 3,500, మేడ్చల్ జిల్లాలో 1,920, రంగారెడ్డి జిల్లాలో 1,920 ఫ్లాట్ల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. పదంతస్తుల టవర్లలో ఒక్కో అంతస్తుకు 12 ఫ్లాట్ల చొప్పున 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించనున్నారు.

ఈ పథకం కింద స్థలం, రూ.5 లక్షల సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుండగా, లబ్ధిదారులు సుమారు రూ.6 లక్షలు నాలుగు విడతల్లో చెల్లించాల్సి ఉంటుంది. కేటాయించిన ఫ్లాట్‌ను పదేళ్లపాటు అమ్మడం లేదా అద్దెకు ఇవ్వడం నిషేధం అని హౌసింగ్ బోర్డు స్పష్టం చేసింది. ఫ్లాట్‌ను ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అందజేస్తుందని, అవసరమైతే బ్యాంకులో తనఖా పెట్టుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. మహిళలకు 30 శాతం, ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం, ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించినట్లు హౌసింగ్ బోర్డు వెల్లడించింది. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేస్తే ఇతర ప్రభుత్వ పథకాలపై ఎలాంటి ప్రభావం ఉండదని హౌసింగ్ బోర్డు స్పష్టం చేసింది. అలాగే ఈఎండీగా చెల్లించే రూ.10 వేల మొత్తాన్ని ఇల్లు కేటాయించకపోతే రెండు రోజుల్లోనే తిరిగి చెల్లిస్తామని, కేటాయిస్తే లబ్ధిదారుడి వాటాలో సర్దుబాటు చేస్తామని తెలిపింది. పథకానికి సంబంధించిన సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక కాల్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## మీసేవలో ఆల్ టైం రికార్డు

- ఒక్కరోజులో 2.20 లక్షల లావాదేవీలు
- మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ పాలనకు ప్రతీకగా నిలిచిన మీసేవ సేవలు మరో రికార్డు క్రియేట్ చేశాయి. గతంలో రోజుకు సగటున 70 నుంచి 80 వేల వరకు మాత్రమే నమోదయ్యే లావాదేవీలు, తాజాగా ఒక్కరోజులోనే 2.20 లక్షలకు చేరుకోవడం విశేషమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మీసేవ చరిత్రలో తొలిసారిగా రెండు లక్షల మార్కును అధిగమించడం రాష్ట్ర ఈగవర్నెన్స్ వ్యవస్థ బలోపేతానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ కార్డు దరఖాస్తులకు అత్యధిక స్పందన లభించగా, రవాణా శాఖ సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర పౌర సేవల కోసం కూడా భారీ సంఖ్యలో ప్రజలు మీసేవను ఆశ్రయించినట్లు వెల్లడించారు. ప్రజలకు సులభంగా, వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడం వల్లే ఈ స్థాయి ఆదరణ లభించిందని మంత్రి అభిప్రాయపడ్డారు.

# వాట్సాప్ అంకుల్స్‌పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు

- వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్ జీ ఓటర్లు
- సోషల్ మీడియా వల్లే జవాబుదారీతనం పెరిగింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మహా** వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్‌జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల నీట్ పరీక్ష వైఫల్యంపై జరిగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' విజయం సాధించారని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మారుతున్న రాజకీయ సమీకరణాలు, యువతరం ప్రాధాన్యతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."యువతరం సరికొత్త రీతిలో ఢిల్లీలో కదం తొక్కింది. ఎవరితోనైతే ఘర్షణకు వెళ్లకూడదో, ప్రధాని మోదీ సరిగ్గా వారితోనే తలపడ్డారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో 'వాట్సాప్ అంకుల్స్'తో సాగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' ఎలా పైచేయి సాధించారో దేశం మొత్తం చూసింది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సైతం అర్ధరాత్రి సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా లేకపోతే పాలకుల్లో జవాబుదారీతనం ఉండేది కాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నేటి యువత వార్తాపత్రికలు చదవడం గానీ, టీవీ ఛానెళ్లు చూడటం గానీ తగ్గించారని, 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారు వార్తలను సైతం రీల్స్ రూపంలోనే వీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.



## బీజేపీ పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది

**టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్**

**హైదరాబాద్, మహా :** దేశంలో ప్రశ్నిస్తే దేశద్రోహం ముద్ర వేస్తున్నారని, కేంద్రంలోని బీజేపీ పత్రిక స్వేచ్ఛను హరిస్తుందని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దేశ పౌరులుగా పత్రిక స్వేచ్ఛ గురించి ఆలోచించాలని సూచించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "రాజ్యాంగం-ప్రజాస్వామ్యం-పత్రికా స్వేచ్ఛ" అంశంపై శనివారం సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో పాల్గొన్న మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ గుప్పిట్లోకి మీడియా సంస్థలు వెళ్లిపోతే నిజాలు మరుగునపడతాయని వ్యాఖ్యానించారు. పత్రికా స్వేచ్ఛ ఏ ప్రభుత్వానికీ ఇచ్చిన వరం కాదని, అది రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కు అని స్పష్టం చేశారు. దేశంలో విభిన్న అభిప్రాయాలను అణిచివేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని, విమర్శిస్తే దేశద్రోహం అనే ముద్ర వేయడం, ప్రశ్నిస్తే శత్రువులుగా చూడటం, మీడియాపై ఒత్తిళ్లు తీసుకురావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

# కలలు కల్లలాయె.. నిరీక్షణ నిరాశాయె..

- ఆసుపత్రి పడకపై ప్రాణాలతో నిరుద్యోగి పోరాటం!
- ప్రభుత్వ నిర్లక్ష్యానికి సమిధగా మారుతున్న యువత.
- కన్నీళ్లు పెట్టిస్తున్న వేణు సూసైడ్ నోట్.



**ఖమ్మం, మహా :** అక్షరాలతో అద్భుతాలు సృష్టించి, పరీక్షలు రాసి జీవితాన్ని గెలవాల్సిన ఆ యువకుడి కలం.. తన చావుకు కారణాలను వివరిస్తూ కన్నీటి సిరాతో సూసైడ్ నోట్ రాసింది. ప్రభుత్వ కొలువు కోసం ఏళ్ల తరబడి కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసి, వయసు కరిగిపోతుంటే తట్టుకోలేక ఆ గుండె ఆగిపోవాలనుకుంది. కటిక పేదరికం ఒకవైపు, పాలకుల నిర్లక్ష్యం మరోవైపు ఆ నిరుద్యోగి పీకల మీద కత్తిపెట్టాయి. ఆసుపత్రి పడకపై ప్రాణవాయువు కోసం కొట్టుమిట్టాడుతున్న ఆ యువకుడి పేరు గడ్డం వేణు కుమార్. ఖమ్మం జిల్లా, మధిర నియోజకవర్గం, ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం అతడి స్వగ్రామం. నిరుద్యోగపు మహాసముద్రంలో ఈదులాడలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వేణు రాసిన లేఖ ఇప్పుడు యావత్ రాష్ట్రంలోని పౌరులందరి చేతా కన్నీరు పెట్టిస్తోంది.

"నా మరణానికి కారణం సరైన సమయానికి గ్రూప్స్ నోటిఫికేషన్లు రాకపోవడమే" అంటూ వేణు రాసిన ప్రతి అక్షరం రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగుల మూగవేదనకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. గత ఐదేళ్లుగా గ్రూప్స్ కోసం అహోరాత్రులు శ్రమిస్తున్న ఆ యువకుడు, ఈ సుదీర్ఘ కాలంలో రాసింది కేవలం ఒక్క పరీక్ష మాత్రమే. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే జాబ్ క్యాలెండర్ ఇస్తుందని, తమ బతుకులు మారతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. కానీ సంవత్సరాలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో నోటిఫికేషన్లు రాకపోవడంతో ఆ యువకుడి ఆశలు అడియాసలయ్యాయి. పంచవర్ష ప్రణాళికల్లా పదేళ్లకు ఒకసారి నోటిఫికేషన్లు ఇస్తే, అభ్యర్థులు తమ విలువైన సమయాన్ని, వయస్సును ఎలా కోల్పోతున్నారో వివరిస్తూ తన లేఖ ద్వారా పాలకులకే పాఠం చెప్పే ప్రయత్నం చేశాడు. చదువుకునే వయసులో ఒక అభ్యర్థి తన జీవిత కాలంలో కేవలం ఒకటి లేదా రెండు నోటిఫికేషన్లు మాత్రమే చూడగలుగుతున్నాడన్న వేణు మాటలు వ్యవస్థ డొల్లతనాన్ని తీవ్రంగా ప్రశ్నిస్తున్నాయి.

వేణు నేపథ్యం చూస్తే బండరాయికైనా కన్నీరు జలజలా రాలాల్సిందే. రాష్ట్రంలో పైస్థాయిలో మార్పులు వస్తున్నాయని చెబుతున్నా, కిందిస్థాయిలో పేదలకు ఏమీ అందడం లేదనడానికి అతడి బతుకే అతిపెద్ద ఉదాహరణ. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఉంటూ, కనీసం తలదాచుకోవడానికి సొంత ఇల్లు కూడా లేక పదేళ్లుగా ఆ కుటుంబం నరకం అనుభవిస్తోంది. ఇందిరమ్మ ఇల్లు కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్నా ఆ కల నెరవేరలేదు. దానికి తోడు సొంత అక్క మానసిక వైకల్యంతో బాధపడుతుండటం ఆ యువకుడిని మరింత కుంగదీసింది. ఒకవైపు గుండెను పిండేసే కుటుంబ భారం, మరోవైపు ఎప్పటికి తీరుతుందో తెలియని నిరుద్యోగం.. ఈ రెండింటి మధ్య నలిగిపోయిన ఆ యువకుడు ప్రాణాలు తీసుకోవడమే శరణ్యమని భావించాడు.

చావు అంచుల దాకా వెళ్లినా ఆ యువకుడిలో సామాజిక బాధ్యత చావలేదు. ప్రభుత్వం తలుచుకుంటే ప్రతి సంవత్సరం ఒక నోటిఫికేషన్ ఇవ్వొచ్చని, తద్వారా నిరుద్యోగుల్లో నమ్మకం పెరుగుతుందని ఆఖరి క్షణాల్లోనూ ఓ అద్భుతమైన సూచన చేశాడు. తన మరణవార్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాహుల్ గాంధీ దృష్టికి వెళ్లాలని, సోషల్ మీడియా తన ఆవేదనను పాలకులకు చేరవేసే బాధ్యత తీసుకోవాలని చేతులెత్తి వేడుకున్నాడు. "ఆగుతుందా నిరుద్యోగి మంట.. విస్ఫోటమై ఎగిసిపడుతుందా ప్రభుత్వం గుండెల నిండా.." అంటూ అతడు రాసిన కవిత చదువుతుంటే ప్రతి ఒక్కరి రక్తం మరుగుతుంది. "కదిలే కలం వేణు.. కదిలించే వయసు నా కవిత్వం.. కానీ ఈ కలం ఇక కదలటం ఆగిపోతుంది" అంటూ ముగించిన వాక్యాలు గుండెను బరువెక్కిస్తున్నాయి. ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్న వేణు ప్రాణాలతో తిరిగి రావాలని, అతడి కలం మళ్లీ కదలాలని, ఈ ఘటనతోనైనా పాలకుల కళ్లు తెరుచుకోవాలని యావత్ సమాజం కన్నీటి ప్రార్థనలు చేస్తోంది.

## కేటీఆర్ మళ్లీ అమెరికా వెళ్లాల్సిన

# టైమ్ వచ్చేసింది

( మొదటి పేజీ తరువాయి )

మంత్రులు అనంతరం రోడ్డు మార్గం ద్వారా నిజామాబాద్ జిల్లా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టును సందర్శించిన భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి వివేక్ నీటి మట్టం, ఇన్ ఫ్లోలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మంత్రి వివేక్ వెంకటస్వామి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులపై తీవ్ర విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 'నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో తెలంగాణ ప్రభుత్వంపై భారం పడింది. 60 టీఎంసీల నీటిని వృథా కావడంతో సుమారు రూ.3 వేల కోట్ల నష్టం మిగిల్చారు. కేటీఆర్‌కు ప్రాజెక్టులపై అవగాహన లేదు. కేటీఆర్ మళ్లీ అమెరికా వెళ్లి ఉద్యోగం చేసుకోవడం మంచిది' అని హితవు పలికారు. కేటీఆర్, హరీశ్ రావు కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి వివేక్ విమర్శించారు. వర్షాలు రాకూడదని బీఆర్ఎస్ నాయకులు కోరుకున్నారని మండిపడ్డారు.ఈ సందర్భంగా భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. 'ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు.



## ఇదీ ఉత్తరాంధ్ర దెబ్బ

విశాఖపట్నం, మహా : ‘‘ఎర్రబస్సు రాని ఊరికి ఎయిర్‌పోర్టు అవసరమా అని కొందరు అన్నారు. ఉత్తరాంధ్రను తక్కువగా అంచనా వేసి ఇక్కడి ప్రజలను అవమానించిన వారికి.. ఈరోజు దిమ్మ తిరిగే సమాధానమే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవం’’ అని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ‘‘ఎర్రబస్సు రాదు అన్న చోటుకి.. ఎయిర్ పోర్ట్ వచ్చింది.. ఎయిర్‌బస్ వచ్చింది.. ఏకంగా మన నమో వచ్చారు. ఇదీ ఉత్తరాంధ్ర దెబ్బ.. అర్థమైందా రాజా’’ అంటూ లోకేశ్ ఉత్తేజభరితంగా ప్రసంగించారు.

**జన్మభూమి రుణం తీర్చుకున్న జీఎంఆర్..**

‘‘రాజాం నుంచి పారిశ్రామికవేత్తగా ఎదిగిన వ్యక్తి గ్రంధి మల్లికార్జునరావు. రికార్డు సమయంలో విమానాశ్రయం నిర్మించి జన్మభూమి రుణం తీర్చుకున్నారు. శ్రీకాకుళం ముద్దు బిడ్డ కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు.. 5 నెలల ముందే ఎయిర్ పోర్ట్ పూర్తిచేశారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు వరం. ఇది ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా మారబోతోంది. ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ హబ్ కాబోతుంది. పరిశ్రమలు, ఐటీ, టూరిజం, హాస్పిటాలిటీ రంగాలకు ఈ విమానాశ్రయం వారధి కాబోతోంది. రోడ్డు, రైలు, విమాన, వాటర్ కనెక్టివిటీతో ఉత్తరాంధ్ర ఆంధ్రప్రదేశ్‌కు పవర్ ఇంజిన్‌గా మారుతుంది’’ అని మంత్రి వివరించారు.

## హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్2026
# భారత్‌కు ఊరట.. అమెరికాకు షాక్

- నాలుగు స్థానాలు ఎగబాకి 81వ ర్యాంక్‌కు చేరిన భారత పాస్‌పోర్ట్.
- అగ్రస్థానాన్ని పదిలపరుచుకున్న సింగపూర్.




ఢిల్లీ, మహా : ప్రపంచ దేశాల పాస్‌పోర్ట్‌ల బలం, అంతర్జాతీయ ప్రయాణ స్వేచ్ఛను అంచనా వేసే ప్రతిష్ఠాత్మక 'హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్2026' జాబితాలో భారత పాస్‌పోర్ట్ ఆశాజనక పురోగతి సాధించింది. గత ఏడాది 85వ స్థానంలో ఉన్న భారత్, ఈసారి నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 81వ ర్యాంక్‌కు చేరుకుంది. తాజా నివేదిక ప్రకారం, భారత పాస్‌పోర్ట్ కలిగిన పౌరులు ప్రస్తుతం 55 దేశాలకు ముందస్తు వీసా లేకుండా లేదా వీసాఆన్‌అరైవల్ సౌకర్యంతో ప్రయాణించే అవకాశం ఉంది. కొన్ని దేశాల వీసా విధానాల్లో వచ్చిన మార్పుల కారణంగా గత ఏడాదితో పోలిస్తే వీసా ఫ్రీ దేశాల సంఖ్య 57 నుంచి 55కు తగ్గినప్పటికీ, ఓవరాల్ ర్యాంకింగ్‌లో భారత్ మెరుగైన స్థానాన్ని సాధించడం గమనార్హం. భారత్ ర్యాంకింగ్ ఎగబాకడం మన పౌరులకు అంతర్జాతీయ ప్రయాణ అవకాశాలు మరింత విస్తరిస్తున్నాయనడానికి సానుకూల సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు.మరోవైపు, అగ్రరాజ్యం అమెరికాకు ఈ జాబితాలో ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. గత దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతగా అమెరికా పాస్‌పోర్ట్ ర్యాంకింగ్ దిగజారిపోయింది. ప్రస్తుతం 30కి పైగా దేశాల పాస్‌పోర్ట్‌లు అమెరికా కంటే మెరుగైన స్థానాల్లో నిలవడం గమనార్హం. అయితే, దీనిని అమెరికా ప్రభావం తగ్గినట్లుగా భావించకూడదని, ప్రపంచంలోని అనేక దేశాలు కొత్త ద్వైపాక్షిక ఒప్పందాల ద్వారా తమ పౌరులకు వీసా నిబంధనలను వేగంగా సులభతరం చేసుకోవడమే అమెరికా వెనుకబడటానికి ప్రధాన కారణమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇక ఈ జాబితాలో సింగపూర్ మరోసారి ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా అగ్రస్థానాన్ని పదిలపరుచుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో జపాన్, దక్షిణ కొరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) సంయుక్తంగా రెండో స్థానాన్ని పంచుకున్నాయి.స్వీడన్ మూడో స్థానాన్ని కైవసం చేసుకోగా.. బెల్జియం, డెన్మార్క్, ఫిన్లాండ్, జర్మనీ, ఐర్లాండ్, ఇటలీ, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, నార్వే, స్పెయిన్, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలు టాప్ 10లో తమ స్థానాలను సుస్థిరం చేసుకున్నాయి. హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ అనేది కేవలం వీసారహిత ప్రయాణ అవకాశాల ఆధారంగానే రూపొందిస్తారని, ఇది ఆయా దేశాల ఆర్థిక, సైనిక లేదా రాజకీయ బలాలకు సూచిక కాదని నిపుణులు గుర్తు చేస్తున్నారు. ప్రపంచ దేశాలు ప్రయాణ స్వేచ్ఛను పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు అంతర్జాతీయ అనుసంధానానికి కొత్త ఊతమిస్తున్నాయని వారు అభిప్రాయపడుతున్నారు.



# భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం

- 56.1 అడుగులకు నీటిమట్టం, బూర్గంపాడు జలదిగ్బంధం.
- లోతట్టు ప్రాంతాల్లో భారీ ముంపు.
- 250 మంది పునరావాస కేంద్రాలకు తరలింపు.
- 1,500 ఎకరాల్లో పంటలు నీటమునుగు



హైదరాబాద్, మహా: ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు పోటెత్తడంతో భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. ఈ ఏడాది అత్యధికంగా నీటిమట్టం 56.1 అడుగులకు చేరడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో ఇళ్లు నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, జిల్లా యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేసింది.వరద తీవ్రత పెరగడంతో అధికారులు అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బూర్గంపాడు మండలంలో సుమారు 250 మంది బాధితులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించి వసతి, ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు. వరద పరిస్థితిని జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు.గోదావరి ఉద్ధృతి కారణంగా పలు ప్రధాన రహదారులు వరద నీటిలో మునిగిపోవడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. సారపాక-నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం-బూర్గంపాడు, మోతె పట్టినగర్-ఇరవెండి మార్గాలు నీటమునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బూర్గంపాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కుక్కునూరు వెళ్లే ప్రధాన రహదారి కూడా పూర్తిగా మూసుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బూర్గంపాడు శివారులోని కొల్లు ప్రాంతం సమీపంలో నాలుగు లారీలు వరద నీటిలో చిక్కుకుపోయాయి. సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని సమయస్ఫూర్తితో స్పందించి లారీ డ్రైవర్లు, క్లీనర్లను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.వరద ప్రభావం రైతాంగంపై తీవ్రంగా పడింది. బూర్గంపాడు మండలంలో దాదాపు 1,500 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ఇప్పటికే ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం కారణంగా సాగు ఆలస్యమై నష్టపోయిన రైతులు, ఇప్పుడు గోదావరి వరదలతో మరోసారి తీవ్ర దెబ్బతిన్నారు. చేతికొచ్చే దశలో ఉన్న పంటలు నీటిలో మునిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముంపు ప్రాంతాల ప్రజలు, రైతులు ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి తగిన నష్టపరిహారం ప్రకటించాలని, పునరావాసంతో పాటు పునర్నిర్మాణ చర్యలు కూడా వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు గోదావరి ప్రవాహం ఇంకా కొనసాగుతుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.



భారతీయ సంస్కృతిలోనే
# మధ్యవర్తిత్వం అంతర్భాగం

- వివాదాల పరిష్కారంలో సంప్రదింపులే తొలి అడుగు.
- వేదాల నుంచి గాంధీ వరకు మధ్యవర్తిత్వ సంప్రదాయాన్ని గుర్తు చేసిన ప్రధాన న్యాయమూర్తి సీజేఐ సూర్యకాంత్.

జైపూర్, మహా. వివాదాలను పరస్పర అంగీకారంతో, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం భారతీయ నాగరికతలో శతాబ్దాలుగా కొనసాగుతున్న గొప్ప సంప్రదాయమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. జైపూర్‌లో నిర్వహించిన కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సు రెండో రోజు శనివారం ప్రసంగించిన ఆయన, మధ్యవర్తిత్వం అనేది చట్టబద్ధమైన వ్యవస్థగా రూపుదిద్దుకునే ముందే భారతీయుల జీవన విధానంలో భాగమైందని స్పష్టం చేశారు.
2023లో మధ్యవర్తిత్వ చట్టం అమల్లోకి వచ్చినప్పటికీ, ఈ విధానం వేల ఏళ్లుగా భారత సంస్కృతిలో కొనసాగుతోందని సీజేఐ పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో శాసన, న్యాయవ్యవస్థలు ఈ విధానాన్ని మరింత బలోపేతం చేశాయని చెప్పారు.ఈ సందర్భంగా మధ్యవర్తిత్వ ప్రాముఖ్యతను వివరించేందుకు ఆయన ఇద్దరు సోదరీమణుల కథను ఉదాహరణగా చెప్పారు. ఒక నారింజ పండును ఇద్దరూ కోరుకోవడంతో చెరిసగం పంచుకున్నారని, అయితే ఒకరికి గుజ్జు, మరొకరికి తొక్క మాత్రమే అవసరమనే విషయాన్ని ముందుగానే పరస్పరం చెప్పుకుని ఉంటే ఇద్దరికీ పూర్తి ప్రయోజనం చేకూరేదని వివరించారు. సంభాషణ, పరస్పర అవగాహన ద్వారానే వివాదాలకు సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందనే సందేశాన్ని ఆయన ఈ ఉదాహరణ ద్వారా ఇచ్చారు.
వేదాలు, రామాయణం, మహాభారతం వంటి భారతీయ ప్రాచీన గ్రంథాల్లో కూడా మధ్యవర్తిత్వానికి సంబంధించిన అనేక విలువైన సూత్రాలు ఉన్నాయని జస్టిస్ సూర్యకాంత్ గుర్తుచేశారు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో పేర్కొన్న సామ, దాన, భేద, దండోపాయం అనే నాలుగు విధానాల్లో తొలి పద్ధతి అయిన 'సామ' నుంచే ఆధునిక మధ్యవర్తిత్వ విధానం ఉద్భవించిందని విశ్లేషించారు.
ప్రాచీన భారతీయ సమాజంలో వివాదాలు తలెత్తితే ముందుగా కుటుంబ స్థాయిలో, ఆ తర్వాత వర్గం, అనంతరం సభ స్థాయిలో పరిష్కరించే ప్రయత్నం జరిగేదని, ఇవన్నీ విఫలమైన తర్వాతే రాజును ఆశ్రయించేవారని ఆయన తెలిపారు. అంటే ఏ సమస్యకైనా తొలి పరిష్కారం సంప్రదింపులు, పరస్పర చర్చలేనని స్పష్టం చేశారు.
మహాత్మా గాంధీ న్యాయవాదిగా పనిచేసిన రోజుల్లో ఇరుపక్షాల మధ్య స్నేహపూర్వక రాజీ కుదర్చడమే తన వృత్తి జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన అనుభవమని చెప్పిన విషయాన్ని కూడా సీజేఐ ప్రస్తావించారు. మధ్యవర్తిత్వం అనేది కేవలం చట్టపరమైన ప్రక్రియ మాత్రమే కాకుండా భారతీయుల ఆలోచనా విధానంలో, సంస్కృతిలో, జీవన విధానంలో విడదీయరాని భాగమని జస్టిస్ సూర్యకాంత్ తన ప్రసంగంలో ఉద్ఘాటించారు.


# ఎస్ఐఆర్ పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు.

- ముందుగా ఏ ఎన్నికలన్నది ఇంకా నిర్ణయం లేదు.
- ఓటరు జాబితా సవరణ తర్వాతే ఎన్నికల షెడ్యూల్.
- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం.

హైదరాబాద్, మహా : తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక సంకేతాలు ఇచ్చింది. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అయితే ముందుగా ఏ ఎన్నికలు నిర్వహించాలనే అంశంపై ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు.
శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో విలేకరులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి ఎన్నికల అంశంపై స్పందించారు. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రాథమిక ప్రక్రియలపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ముఖ్యంగా ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా పూర్తి చేయడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తైన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణపై రాజకీయ వర్గాల్లో జోరుగా జరుగుతున్న చర్చల నేపథ్యంలో మంత్రి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఎన్నికల ప్రక్రియను చట్టబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని అంశాలను పరిశీలిస్తోందని తెలిపారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో విభేదాలు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని కూడా పొంగులేటి ఖండించారు. పార్టీ నాయకుల మధ్య పూర్తి స్థాయి సమన్వయం ఉందని, ప్రభుత్వాన్ని రాజకీయంగా దెబ్బతీయాలనే ఉద్దేశంతో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు ఎన్నికల ప్రక్రియను కూడా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.
అదే సమయంలో ధరణి భూ అక్రమాలపై ప్రభుత్వం కఠిన చర్యలు కొనసాగిస్తోందని, భూ భారతి విధానం ద్వారా భూమి యజమానులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పునరుద్ఘాటించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, అసైన్డ్ భూములపై కొత్త విధానం, రీసర్వే ప్రక్రియ వంటి అంశాలపై కూడా ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు.

# అజిత్ ఢోబాల్ సేవలకు చరిత్రలో 'గోల్డెన్ పేజీ' ఉంటుంది

- లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం-2026 ప్రదానం.
- దేశ భద్రత, విదేశాంగ విధానంలో ధోబాల్ పాత్రను కొనియాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా.



పుణె, మహా: జాతీయ భద్రత, విదేశాంగ విధానాన్ని బలోపేతం చేయడంలో విశేష సేవలందించిన జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ ధోబాల్‌కు ప్రతిష్ఠాత్మక 'లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం2026' ప్రదానం చేశారు. శనివారం పుణెలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా ధోబాల్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం మాట్లాడిన అమిత్ షా, దేశ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడంలో అజిత్ ధోబాల్ చేసిన సేవలను ప్రశంసలతో ముంచెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న తొలి కీలక నిర్ణయాల్లో అజిత్ ధోబాల్‌ను జాతీయ భద్రతా సలహాదారుగా నియమించడం ఒకటని అమిత్ షా గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వ హయాం గానీ, దేశ అంతర్గత, బాహ్య భద్రత చరిత్ర గానీ ఎప్పుడైనా లిఖించబడితే, అజిత్ ధోబాల్ సేవలకు తప్పకుండా ఒక 'గోల్డెన్ పేజీ' కేటాయించాల్సి ఉంటుందని అన్నారు. గతంలో బలహీనంగా ఉన్న భారత విదేశాంగ విధానం ప్రస్తుతం దృఢమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన విధానంగా మారడంలో ధోబాల్ పాత్ర అత్యంత కీలకమైందని షా పేర్కొన్నారు. జాతీయ భద్రతకు సంబంధించిన ప్రతి ప్రధాన నిర్ణయంలో ప్రధాని మోదీకి ఆయన అందించిన సలహాలు ఎంతో విలువైనవని కొనియాడారు. తాను గుజరాత్ హోంమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన వరుస బాంబు పేలుళ్ల కేసుల దర్యాప్తులో అజిత్ ధోబాల్ వ్యూహాత్మక సలహాలు కీలకంగా నిలిచాయని అమిత్ షా గుర్తు చేసుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ సూచనల మేరకు ధోబాల్‌తో జరిగిన చర్చల తర్వాత గుజరాత్ పోలీసులు అహ్మదాబాద్ పేలుళ్ల కేసుతో పాటు దేశవ్యాప్తంగా జరిగిన మరో 13 బాంబు పేలుళ్ల కేసులను ఛేదించగలిగారని వెల్లడించారు. అదేవిధంగా, లోకమాన్య బాల గంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను అమిత్ షా స్మరించుకున్నారు. "స్వరాజ్యం నా జన్మహక్కు" అనే నినాదంతో కోట్లాది భారతీయుల్లో జాతీయ చైతన్యాన్ని రగిలించిన మహనీయుడిగా తిలక్‌ను అభివర్ణించారు. తిలక్ కలలుగన్న సాంస్కృతిక జాతీయవాద మార్గంలోనే భారత్ పయనిస్తోందని, ఆ మార్గం నుంచి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పురస్కారం అందుకున్న అనంతరం మాట్లాడిన అజిత్ ధోబాల్ దేశ యువతకు కీలక సందేశం ఇచ్చారు. ప్రతి భారతీయుడు, ముఖ్యంగా యువత లోకమాన్య తిలక్ జీవితాన్ని, దేశం కోసం ఆయన చేసిన త్యాగాలను, ఆయన దార్శనికతను లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు. స్వాతంత్ర్యం అంటే ఇష్టానుసారంగా వ్యవహరించే స్వేచ్ఛ కాదని, దేశం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛ అని ధోబాల్ పేర్కొన్నారు. భయం, అణచివేత, దుర్భర పరిస్థితులు నెలకొన్న కాలంలో ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని నింపిన గొప్ప నాయకుడిగా లోకమాన్య తిలక్ నిలిచారని ఆయన కొనియాడారు.

# రెండేళ్ల చిన్నారి అసాధారణ ప్రతిభ

- 150కిపైగా దేశాల జెండాలు గుర్తించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం.
- రెండేళ్ల 8 నెలల వయసులోనే అద్భుత జ్ఞాపకశక్తి.
- త్వరలో గిన్నిస్ రికార్డే లక్ష్యమంటున్న తల్లిదండ్రులు.

గయా (బిహార్), మహా.: బిహార్‌లోని గయా జిల్లాకు చెందిన రెండేళ్ల 8 నెలల చిన్నారి వాణి తన అసాధారణ జ్ఞాపకశక్తితో అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇంకా ఇంగ్లీష్ అక్షరమాల పూర్తిగా నేర్చుకోని ఈ చిన్నారి ప్రపంచంలోని 150కిపైగా దేశాల జెండాలను క్షణాల్లో గుర్తించి చెప్పగలుగుతోంది. ఈ అరుదైన ప్రతిభకు గుర్తింపుగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి ప్రశంసలు ందుకుంటోంది.గయా జిల్లా ఉత్రెన్ గ్రామానికి చెందిన రవికాంత్ కుమార్, పల్లవి మిశ్రా దంపతుల కుమార్తె వాణి. రవికాంత్ బజాజ్ ఫైనాన్స్‌లో శాఖ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వాణికి రెండున్నరేళ్ల వయసు ఉన్నప్పుడు ఆడుకుంటూ ఒక పోస్టర్‌లో ఉన్న 20 దేశాల జెండాలను సులభంగా గుర్తించడంతో ఆమె అసాధారణ జ్ఞాపకశక్తిని తండ్రి గమనించారు. అప్పటి నుంచి కుమార్తెలోని ప్రతిభను మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా ప్రోత్సహించడం ప్రారంభించారు.వాణికి చిన్నప్పటి నుంచే రంగులంటే ప్రత్యేక ఆసక్తి ఉండేదని రవికాంత్ తెలిపారు. మొదట వివిధ రంగులను గుర్తించడం నేర్పించగా, అనంతరం ప్రపంచ దేశాల జెండాల చిత్రాలను చూపిస్తూ వాటి గురించి వివరించామని చెప్పారు. రోజుకు ఐదు నుంచి పది జెండాలు నేర్చుకుంటూ, మరుసటి రోజే కొత్త జెండాల గురించి అడిగేదని పేర్కొన్నారు. ప్రస్తుబ 150కిపైగా దేశాల జెండాలను ఎలాంటి గందరగోళం లేకుండా సునాయాసంగా గుర్తించగలుగుతోందని తెలిపారు. ఒకేలా కనిపించే జెండాల మధ్య తేడాలను కూడా వాణి సులభంగా గుర్తిస్తుందని చెప్పారు.. వాణి ప్రతిభను గుర్తించిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఆమెకు పతకం, గుర్తింపు కార్డు అందజేసింది. ఈ గౌరవం తమ కుటుంబానికి ఎంతో ఆనందాన్ని కలిగించిందని రవికాంత్ తెలిపారు. త్వరలోనే తన కుమార్తె గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో కూడా చోటు సంపాదిస్తుందనే పూర్తి నమ్మకం ఉందన్నారు.
వాణి తల్లి పల్లవి మిశ్రా కూడా కుమార్తె విజయంపై హర్షం వ్యక్తం చేశారు. సరస్వతీ దేవి అనుగ్రహంతోనే వాణికి ఈ అసాధారణ జ్ఞాపకశక్తి లభించిందని ఆమె అన్నారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు కావడం కుటుంబానికి గర్వకారణమని, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో కూడా వాణి తన ప్రతిభను చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.




# పార్లమెంట్ స్కిట్ వివాదం


- రాహుల్ గాంధీ సహా ముగ్గురు ఎంపీలపై ఎఫ్ఐఆర్.
- సనాతన ధర్మాన్ని అవమానించారంటూ ఫిర్యాదు.
- వారణాసిలో కేసు నమోదు వారణాసి,


మహా. పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష ఇండియా కూటమి ప్రదర్శించిన సెటైరికల్ స్కిట్ రాజకీయ దుమారం రేపింది. ఈ ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బిహార్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్ (రాజేశ్ రంజన్), సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అవధేశ్ ప్రసాద్‌లపై ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సనాతన ధర్మాన్ని, హిందువుల మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించారంటూ పలువురు సాధువులు చేసిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు కాశీ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) గౌరవ్ బన్స్వాల్ తెలిపారు. ఫిర్యాదు ప్రకారం, పార్లమెంట్ ఆవరణలో ప్రదర్శించిన స్కిట్‌లో ముగ్గురు ఎంపీలు సనాతన ధర్మాన్ని కించపరిచేలా వ్యవహరించారని, హిందూ మత విశ్వాసాలను అవమానించే విధంగా ప్రదర్శన ఇచ్చారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జగద్గురు బాలక్ దాస్ సహా పలువురు సాధువులు ఫిర్యాదు చేస్తూ, పప్పూ యాదవ్ శ్రీరాముడిని, సనాతన ధర్మాన్ని అవమానించేలా నటించారని ఆరోపించారు. ఈ ఘటన హిందూ సమాజం మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని, అందుకే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. జులై 31న పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపీలు అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు చేస్తూ నిరసన చేపట్టారు. అలాగే జులై 20న విద్యార్థుల 'చలో పార్లమెంట్' ఆందోళన సందర్భంగా జరిగిన పోలీసు చర్యలను కూడా వ్యతిరేకించారు. ఈ నిరసనలో భాగంగా పార్లమెంట్‌లోని మకర్ ద్వార్ మెట్ల వద్ద విరాళాల పెట్టెలను ఉంచి ప్రతీకాత్మక స్కిట్ ప్రదర్శించారు. స్కిట్‌లో రాహుల్ గాంధీ సహా పలువురు ఎంపీలు భక్తుల్లా వచ్చి హుండీల్లో విరాళాలు వేస్తుండగా, కాషాయ వస్త్రాలు ధరించిన పప్పూ యాదవ్ ఆ డబ్బును తన జేబులో వేసుకుంటున్నట్లుగా నటించారు. అనంతరం సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు ఆయనతో వాగ్వాదానికి దిగినట్లు ప్రదర్శన ముగించారు. రామమందిరం విరాళాల దుర్వినియోగంపై తమ ఆరోపణలను ప్రజలకు తెలియజేయడానికే ఈ స్కిట్ నిర్వహించినట్లు ప్రతిపక్ష నేతలు పేర్కొన్నారు. అయితే కాషాయ వస్త్రాలను ఉపయోగించి సనాతన సంప్రదాయాలను, భగవాన్ శ్రీరాముడిని అవమానించేలా ఈ స్కిట్ ఉందని సాధువులు, బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ సాక్షి మహారాజ్ ఈ ప్రదర్శన హిందూ మత విశ్వాసాలను కించపరిచేలా ఉందని విమర్శిస్తూ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు అవధేశ్ ప్రసాద్, ధర్మేంద్ర యాదవ్, జార్ఖండ్ ముక్తి మోర్చా ఎంపీ మహువా మాజి తదితరులు పాల్గొన్నారు. "అమిత్ షా రాజీనామా చేయాలి", "అమిత్ షా సభకు రావాలి", "చఢావా చోర్, గద్దీ ఛోడ్" అంటూ నినాదాలు చేశారు. అలాగే "అమిత్ షా సదన్ సే గాయబ్ క్యోన్?" అని రాసిన బ్యానర్‌ను ప్రదర్శించారు.

# బాలయ్య కుమార్తె హీరోయిన్‌గా?

## తేజస్విని ఎంట్రీపై జోరుగా ప్రచారం

నందమూరి నటసింహం బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని నందమూరి త్వరలో వెండితెరపై హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వబోతున్నారనే వార్త టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. నందమూరి కుటుంబం నుంచి ఇప్పటికే పలువురు హీరోలు సినీ రంగంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, ఆ కుటుంబం నుంచి హీరోయిన్‌గా ఎవరూ ఇప్పటివరకు సినీ పరిశ్రమలోకి రాలేదు. ఈ నేపథ్యంలో తేజస్విని ఎంట్రీ నిజమైతే నందమూరి కుటుంబం నుంచి వెండితెరపై అడుగుపెట్టనున్న తొలి నటిగా ఆమె నిలవనున్నారు.సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, తేజస్విని ఓ మహిళా ప్రధాన కథాంశంతో రూపొందనున్న స్పోర్ట్స్ డ్రామా ద్వారా నటిగా పరిచయం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. సామాజిక సందేశంతో కూడిన బలమైన కథ, పాత్రకు ఉన్న ప్రాధాన్యం నచ్చడంతో ఆమె ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది.aఇప్పటికే నిర్మాతగా బాలకృష్ణ సినిమాల నిర్మాణ వ్యవహారాలు, ప్రమోషన్లలో చురుకుగా వ్యవహరిస్తూ తన ప్రతిభను చాటుకున్న తేజస్విని ఇప్పుడు నటిగా మారనున్నారనే వార్త నందమూరి అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఈ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందో తెలుసుకోవాలని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు






# 'కళ్యాణ్ బాబాయ్ నా గుండెల్లో ఉంటారు'

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ప్రస్తుతం తన కొత్త చిత్రం 'కొరియన్ కనకరాజ్' ప్రమోషన్లలో బిజీగా ఉన్నారు. హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో చోటుచేసుకున్న ఓ సంఘటన మెగా అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. సినిమా గురించి మాట్లాడేందుకు వరుణ్ తేజ్ మైక్ పట్టుకున్న సమయంలో అభిమానులు ఒక్కసారిగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పేరును నినదిస్తూ "బాబులకే బాబు.. కళ్యాణ్ బాబు" అంటూ హోరెత్తించారు. కొద్దిసేపు ఆ ప్రాంతమంతా పవన్ నినాదాలతో మార్మోగిపోయింది. v అభిమానుల నినాదాలకు వరుణ్ తేజ్ ఎంతో హుందాగా స్పందించారు. ఎలాంటి అసహనం ప్రదర్శించకుండా చిరునవ్వుతో అభిమానుల ప్రేమను స్వీకరించారు. అనంతరం తన చేతిని గుండెపై పెట్టుకుని "కళ్యాణ్ బాబాయ్ నా గుండెల్లో ఉంటారు" అన్నట్లుగా ఎమోషనల్ సైగ చేయడంతో అభిమానులు మరింత ఉత్సాహానికి లోనయ్యారు. ఈ దృశ్యం అక్కడున్న వారిని ఆకట్టుకోవడంతో పాటు సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారింది. మెగా కుటుంబ సభ్యుల మధ్య ఉన్న ఆప్యాయత, పరస్పర గౌరవానికి ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచిందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వరుణ్ తేజ్, కుటుంబ సభ్యుల పట్ల తనకున్న అభిమానాన్ని ప్రతి సందర్భంలోనూ చాటుకుంటారని ఫ్యాన్స్ చెబుతున్నారు. ప్రస్తుతం ఈ వీడియో ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు ఇతర సోషల్ మీడియా వేదికల్లో వైరల్‌గా మారింది. మెగా అభిమానులు భారీగా షేర్ చేస్తూ వరుణ్ తేజ్ స్పందనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'కొరియన్ కనకరాజ్' చిత్రంతో వరుణ్ తేజ్ మరో విజయాన్ని అందుకోవాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.






# బాక్సాఫీస్‌లో ఆసక్తికర పోరు

**'ఆవారాపన్ 2'కు 'బట్వారా 1947' నుంచి గట్టి పోటీ!**

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కల్ట్ క్లాసిక్ 'ఆవారాపన్'కు సీక్వెల్‌గా తెరకెక్కిన 'ఆవారాపన్ 2'పై తొలుత భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇమ్రాన్ హష్మీ కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న చిత్రానికి కొనసాగింపుగా వస్తుండటంతో అభిమానుల్లో ఉత్సాహం కనిపించింది. అయితే విడుదల తేదీ సమీపిస్తున్న కొద్దీ ఆ ఉత్సాహం కొంత తగ్గినట్లు బాలీవుడ్ ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఆగస్టు 14న 'ఆవారాపన్ 2' ప్రేక్షకుల ముందుకు రానుండగా, అదే రోజు సన్నీ డియోల్ హీరోగా రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో తెరకెక్కిన 'బట్వారా 1947' కూడా విడుదల కానుంది. దీంతో బాక్సాఫీస్ వద్ద ఈ రెండు చిత్రాల మధ్య గట్టి పోటీ నెలకొననుంది. 2007లో విడుదలైన 'ఆవారాపన్' అప్పట్లో భారీ వసూళ్లు రాబట్టకపోయినా, తర్వాత కల్ట్ క్లాసిక్‌గా గుర్తింపు పొందింది. ముఖ్యంగా సినిమాలోని పాటలు ఇప్పటికీ సంగీత ప్రియులను అలరిస్తున్నాయి. అదే భావోద్వేగాన్ని కొనసాగిస్తూ రూపొందించిన 'ఆవారాపన్ 2'పై మొదట ఆసక్తి కనిపించినప్పటికీ, ప్రమోషన్లు ఆశించిన స్థాయిలో లేకపోవడం, విడుదలైన పాటలకు మిశ్రమ స్పందన రావడం సినిమాపై ప్రభావం చూపుతున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇమ్రాన్ హష్మీ సినిమాలకు ప్రధాన బలంగా నిలిచే సంగీతం ఈసారి పెద్దగా ఆకట్టుకోలేదనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు 'బట్వారా 1947' దేశ విభజన నేపథ్యంలో రూపొందిన దేశభక్తి కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘటక్' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన సన్నీ డియోల్-రాజ్‌కుమార్ సంతోషి కాంబినేషన్ మరోసారి కలిసి రావడంతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఒకవైపు కల్ట్ క్లాసిక్ సీక్వెల్, మరోవైపు దేశభక్తి నేపథ్యంలో రూపొందిన భారీ చిత్రం... ఈ రెండు సినిమాల్లో ఏది ప్రేక్షకులను ఎక్కువగా ఆకట్టుకుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఆగస్టు 14న విడుదల కానున్న ఈ చిత్రాల్లో బాక్సాఫీస్ విజేత ఎవరో తేలాల్సి ఉంది.



## సాంప్రదాయ లుక్‌లో

# ఈషా రెబ్బ మెస్మరైజ్

తెలుగు సినీ నటి ఈషా రెబ్బ మరోసారి తన సాంప్రదాయ అందాలతో సోషల్ మీడియాను ఆకట్టుకుంది. తాజాగా నిర్వహించిన ట్రెడిషనల్ ఫోటోషూట్‌లో ఆమె రాజసాన్ని తలపించే లుక్‌లో కనిపించి అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. లేత బంగారు వర్ణంలోని చేతి నేసిన చీరలెహంగా దుస్తుల్లో ఈషా ఎంతో హుందాగా మెరిసింది. సున్నితమైన మెటాలిక్ ఎంబ్రాయిడరీతో అలంకరించిన ఈ దుస్తులకు సంప్రదాయ వడ్డాణం జత చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ లుక్‌కు కుందన్ చోకర్, పచ్చల పెండెంట్, భారీ జుంకీలు, ఆలయ శైలి గాజులు వంటి ఆభరణాలు మరింత నిండుదనాన్ని తీసుకొచ్చాయి. పాతకాలపు ఇటుకల గోడల నేపథ్యంలో నిర్వహించిన ఈ ఫోటోషూట్‌లో ఈషా ఇచ్చిన హావభావాలు, హుందాతనం, సంప్రదాయ సోయగం అభిమానులను కట్టిపడేస్తున్నాయి. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారగా, అభిమానులు ఆమె అందాన్ని, అభినయాన్ని ప్రశంసిస్తూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సినిమాల విషయానికి వస్తే, ఈషా రెబ్బ తన సహజ నటనతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల తరుణ్ భాస్కర్‌తో కలిసి నటించిన కామెడీడ్రామా 'ఓం శాంతి శాంతి శాంతిహి' చిత్రంలో ఆమె నటనకు విమర్శకులు, ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు లభించాయి. భావోద్వేగాలు, హాస్యం కలగలిపిన పాత్రలో ఈషా తన నటనతో మరోసారి ఆకట్టుకుంది. అంతకుముందు 'మామా మశ్చీంద్ర', ద్విభాషా థ్రిల్లర్ 'ఒట్టు (రెండగం)' వంటి చిత్రాల్లోనూ ఆమె తన పాత్రలకు పూర్తి న్యాయం చేస్తూ నటిగా మరో మెట్టు ఎదిగింది. విభిన్న కథలను ఎంపిక చేసుకుంటూ కెరీర్‌లో ముందుకు సాగుతున్న ఈషా, నటిగా మాత్రమే కాకుండా ఫ్యాషన్ ఐకాన్‌గా కూడా గుర్తింపు పొందుతోంది. ఒకవైపు సినిమాల్లో విభిన్న పాత్రలతో మెప్పిస్తూనే, మరోవైపు సంప్రదాయ దుస్తులు, ఎలిగెంట్ ఫోటోషూట్లతో సోషల్ మీడియాలో నిరంతరం అభిమానులను అలరిస్తోంది. ప్రతి కొత్త ఫోటోషూట్‌తో తన స్టైల్‌ను కొత్తగా ఆవిష్కరిస్తూ, సౌత్ ఇండియన్ సినీ పరిశ్రమలో ప్రతిభావంతమైన నటీమణుల్లో ఒకరిగా ఈషా రెబ్బ తన ప్రత్యేక స్థానాన్ని మరింత బలపరుచుకుంటోంది.

# బ్రేకప్ ప్రచారం మధ్య అనుపమ ఆసక్తికర వ్యాఖ్యలు



**'పరదా' ఫలితం బాధించింది.. కానీ భయపడను**

తన వ్యక్తిగత జీవితంపై, ముఖ్యంగా బ్రేకప్ వార్తలపై సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతున్న సమయంలో హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తాజాగా ఆమె నటించిన 'క్రేజీ కళ్యాణం' టీజర్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్న అనుపమ, తన కెరీర్‌లో ఎదురైన కష్టాలు, 'పరదా' సినిమా ఫలితం, మహిళా ప్రధాన చిత్రాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'పరదా' సినిమాపై ఎంతో నమ్మకంతో పనిచేశానని, నటిగా తన అత్యుత్తమ ప్రతిభను చూపించినప్పటికీ ఆశించిన స్థాయిలో థియేటర్లలో ఆదరణ లభించలేదని అనుపమ చెప్పారు. ఆ సినిమా ఫలితం తనకు ఒక వెనుకడుగు వేసిన అనుభూతిని కలిగించిందని, ఎంతో కష్టపడినా ఆశించిన ఫలితం రాకపోవడం బాధ కలిగించిందని వెల్లడించారు. ఆ సమయంలో మహిళా ప్రధాన చిత్రాలకు ప్రేక్షకులు ఆదరణ చూపడం లేదా? అనే సందేహం కూడా కలిగిందన్నారు. అయితే ఇటీవల విడుదలైన 'మా ఇంటి బంగారం' వంటి చిత్రాలు మంచి ఆదరణ పొందడం మహిళా ప్రధాన కథలపై మళ్లీ ఆశలు పెంచిందని ఆమె అన్నారు. భయం ఉన్నప్పుడే కొత్త సవాళ్లను స్వీకరించాలని తాను నమ్ముతానని, మహిళా ప్రధాన చిత్రాలను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోనని స్పష్టం చేశారు. సినిమా విడుదలైన రోజుతోనే తాను ఆ ప్రాజెక్ట్ నుంచి మానసికంగా బయటకు వచ్చేస్తానని, వెంటనే తదుపరి చిత్రంపై దృష్టి పెడతానని అనుపమ తెలిపారు. అయితే 'పరదా' విషయంలో మాత్రం సాధారణం కంటే ఎక్కువ బాధపడ్డానని, ఒకటి రెండు రోజులు ఆ ఫలితం గురించి తీవ్రంగా ఆలోచించానని చెప్పారు. తన జీవితంలో ఒక క్లిష్టమైన దశను ఎదుర్కొని బయటకు వచ్చానని చెప్పిన అనుపమ, ఆ రోజులను మాటల్లో వివరించడం సాధ్యం కాదన్నారు. కాలమే తన ప్రయాణాన్ని అందరికీ అర్థమయ్యేలా చేస్తుందని పేర్కొంటూ, కష్టకాలం తనను మరింత బలమైన వ్యక్తిగా మార్చిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034